

చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 28: పట్టణంలోని గిరిజన ఆదర్శబాలికల క్రీడాపాఠశాలలో శనివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్-14,-17 క్రీడాకారుల ఎంపికపోటీలను మాజీఎంపీపీ మల్లికార్జున్‌యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈపోటీలకు 180మందిరాగా ఉత్తమప్రతిభ కనబర్చిన 20 మందిని ఎంపిక చేసినట్లు చౌపన్‌గూడ హెడ్‌మాస్టర్ మనోహర్, పోటీల ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పీఈటీ రవి తెలిపారు. ఎంపికైన క్రీడాకారలు మంచిర్యాలలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. విద్యార్థులను డీఈవో యాదయ్య అభినందించారు.

రోడ్డుపైనే లారీల పార్కింగ్

● ఎస్పీఎం కర్ర లారీలతో స్థానికుల తంటాలు



ప్రధాన రహదారిపై నిలిపిన లారీలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28: ఎస్పీఎంలో కాగితపు ఉత్పత్తికి నిత్యం లారీల్లో నీలగిరి, వెదురు బొంగులను తీసుకొస్తారు. ఈ లారీలన్నీ వెంటనే అన్‌లోడ్ కాకపోవడంతో వారంతా లోడ్ లారీలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ఎస్పీఎంగేటు నుంచి మొదలుకొంటే బీఎంఎస్ కార్యాలయం వరకు, చెక్‌పోస్టు నుంచి పెద్దవాగు వరకు రోడ్డుకి ఒకభాగం ఈ లారీలను నిలిపారు. ఇలా రోడ్డు సగభాగం లారీలే ఆక్రమించాయి. దీంతో ఇరువైపులావచ్చే వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రక్షణ పద్ధతులు తెలుసుకోవాలి



అవగాహన సదస్సులో సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28: వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు రక్షణ పద్ధతులు తెలుసుకోవాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. కోసిని డ్యాంవద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు వరదలో చిక్కుకున్న వారిని రక్షించే అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు రక్షణ పద్ధతులు తెలుసుకోవాలన్నారు. దీనిద్వారా తోటివారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రమేష్, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

వాంకిడి, సెప్టెంబరు 28: సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని వైద్యాధికారి వినయ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవ్యాధి జన్యుపరంగా వచ్చే వ్యాధి అని దీని ప్రారంభదశలో గుర్తిస్తే నివారించవచ్చని అన్నారు. దీర్ఘకాలిక రక్తహీనత, ఎముకలలో తీవ్రమైన నొప్పిఉంటే ఆరోగ్య కేంద్ర సిబ్బందికి ఆశా, ఏఎన్‌ఎం లేదా డాక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జావీద్, ఎంఈవో శివచరణ్‌కుమార్, ఎంపీవో శ్రవణ్‌కుమార్, హెచ్‌ఈవో రవిదాస్, పీహెచ్‌ఎన్ క్రిష్ణయ్య, సూపర్‌వైజర్ అనసూయ, హెచ్‌ఏ భగవాన్‌దాస్, జీపీ కార్యదర్శి పాల్గొన్నారు.

ధరల మంట వంటకు తంటా



● పెరగని మధ్యాహ్న భోజన బిల్లులు
● నాలుగు నెలలుగా అందని బకాయిలు
● పెరిగిపోతున్న అప్పులు
● కష్టాల్లో వంట నిర్వాహకులు

బెజ్జూరు, సెప్టెంబరు 28: విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వపాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనపథకానికి నిత్యావసర ధరల పెరుగుదల శరాఘాతంగా మారుతోంది. చాలా ఏళ్ల నుంచి ఒక్కో విద్యార్థిపై కేటాయిస్తున్న బడ్జెట్‌ను పెంచకపోవడం, సకాలంలో గౌరవవేతనం, బిల్లులు రాకపోవడం మరోకారణం. దీంతో నిర్వాహకులు తోచిన విధంగా విద్యార్థులకు వడ్డిస్తున్నారు. దీంతో నాణ్యమైన భోజనం అందక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వారికి సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా మెనూప్రకారం భోజనం అందడం లేదు.

పేద విద్యార్థులే అధికం..

ప్రభుత్వపాఠశాలల్లో అత్యధికంగా పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు చదువుతుంటారు. జిల్లాలో 990 ప్రభుత్వ పాఠశాలలుండగా, 42,350 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1591ఏజెన్సీలు ఉన్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకం వల్ల హాజరుశాతం పెరుగు తోంది. మెనూప్రకారం అన్నంతోపాటు కూర, సాంబారు వడ్డించాలి. వారానికి మూడుసార్లు కోడిగుడ్లు అందించాలి.

రెండేళ్లుగా పెంపు లేదు..

విపణిలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం ధరలను పెంచడం లేదు. రెండేళ్లకిందట ధరలు పెంచగా ప్రస్తుతం నిత్యావసర ధరలు రెట్టింపయ్యాయి. దీంతో గిట్టుబాటు కావడం లేదని, రెండేళ్ల నుంచి మధ్యాహ్న భోజనం పథకం ధరలు పెరగని కారణంగా ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు. ఒకవైపు నిత్యావసర ధరలతోపాటు కూర గాయల ధరలు పెరగడం వండిపెట్టిన వాటికి బిల్లులు సక్రమంగా చెల్లించని కారణంగా దుకాణాల్లో అప్పులు పెరుగుతున్నాయని వాపోతున్నారు.

బిల్లులు విడుదలలో జాప్యం..

వంట కార్మికులకు సకాలంలో గౌరవవేతనం, బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కిరాణ దుకాణాలు, కూరగాయల దుకాణాల్లో అప్పులుచేసి మరీ కొనుగోలు చేస్తున్నారు. బిల్లులు వచ్చినప్పుడు తిరిగి చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కార్మికులకు నెలకు రూ.3వేలు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. జిల్లాలో 1591ఏజెన్సీలు ఉన్నాయి. ప్రస్తుతం కార్మికులకు రూ.వేయి మాత్రమే అందగా, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.2వేలు విడుదల కాలేదు.

పెరిగిన నూనె ధరలు..

ప్రస్తుతం మార్కెట్‌లో వంటనూనె లీటరుకు రూ.20మేర పెరిగింది. దీనికి తోడు కొన్ని రకాల కూరగాయల ధరలు కూడా మండుతుండటంతో నిర్వాహకులు ఏం పెట్టాలో తెలియక అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో ఉల్లి, అల్లం, వెల్లుల్లితో పాటు కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో అప్పులు తెచ్చి పెడుతున్నా ప్రభుత్వం మాత్రం బిల్లులను సకాలంలో ఇవ్వడంలేదు. దీంతో అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని, తమకు సరుకులు అరువుపై ఇవ్వడం కుదరదని దుకాణదారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికే నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే తాము విద్యార్థులకు ఏం వండిపెట్టాలని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు ఇచ్చే రూపాయలు ఇలా ఉన్నాయి. 1-5తరగతి విద్యార్థులకు రూ.5.45, 6-8 విద్యార్థులకు 8.17, గుడ్డుకు రూ.5, 9-10విద్యార్థులకు గుడ్డును కలుపుకొని రూ.10.67 రూపాయల చొప్పున చెల్లిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే బిల్లు లు ఏమాత్రం సరిపోక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం వంట నిర్వాహకులకు ప్రతి నెలా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అప్పులు పెరుగుతున్నాయి..: కుంరం కమల



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న తమకు ప్రతినెలా బిల్లులు విడుదల చేయడం లేదు. దుకాణాల్లో వంట కోసం మేం చేసే అప్పులు పెరిగిపోతున్నాయి. వంట కోసం కూరగాయల దుకాణాలు, కిరాణాదుకాణాల్లో అప్పులు పెరగడం వల్ల వారు సరుకులు ఇవ్వడం లేదు. విద్యార్థులకు ఎలా వండి పెట్టేది. ప్రభుత్వం స్పందించి నెలానెలా బిల్లులు చెల్లించాలి.



వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు

కుమరం భీం వర్ధంతిని విజయవంతం చేయాలి: కలెక్టర్



జోడేఘాట్‌లో భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, సెప్టెంబరు 28: జిల్లాలోని జోడేఘాట్‌లో అక్టోబరు 17న నిర్వహించనున్న కుమరంభీం 84వ వర్ధంతి కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కెరమెరి మండలం జోడేఘాట్‌లోని మ్యూజియంహాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మబొజ్జు, డీఆర్వో లోకేశ్వర్ రావు, భీం మనుమడు సోనేరావుతో కలిసి 29శాఖల అధికారులు, కమిటీ నాయకులతో వర్ధంతి వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, విద్య, పోలీసుశాఖ సమన్వ యంతో కార్యక్రమాల నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జోడేఘాట్ తోపాటు పరిసరగ్రామాలు, ప్రాంతాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చూడాలని తెలిపారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలకు హాజరయ్యే ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు ఆహారం ఏర్పాటు చేయాలన్నారు.జీసీసీ ఉట్నూర్ ఆధ్వర్యంలో ఆహారం సరఫరా చేయాలని, రోడ్లు, భవనాలు, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం సమన్వయంతో వాహనాల పార్కింగ్, అవసరమైన ప్రాంతాల్లో ర్యాంపులు ఏర్పాటుచేయాలన్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఈఈ ఆధ్వర్యంలో టెంట్లు, మ్యూజియంలో ఫ్యాన్లు, లైట్లు ఇతర మరమ్మతులు, బారికేడ్ల ఏర్పాటు, హట్టినుంచి జోడేఘాట్‌వరకు రోడ్డుమరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అత్యవసరం కొరకు రెండు జనరేటర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇతరజిల్లాల నుంచి వచ్చే ప్రజలకు ఆయాజిల్లాల అధికా రులు సమన్వయంతో బస్సులు నడిపించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి108,104 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో స్వయంసహాయక సంఘాల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సంచార మూత్రశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఒక కుటుంబం లాగా బాధ్యతగా వ్యవహరించి మంచి వాతావరణంలో వేడుకలను విజయవంతం చేసే విధంగా కృషిచేయాలని తెలిపారు. అనంతం జోడేఘాట్‌లో దర్బార్ నిర్వహించే ప్రాంతాలను, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, వర్ధంతి వేడుకలు, దర్బార్ కార్యక్రమాలు ఎలాంటి అవాంచనీయ ఘటనలు లేకుండా ప్రశాంతవాతావరణంలో జరిగే విధంగా అధికారులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, కన్వీనర్ మోతీరాం, నాయ కులు ప్రభాకర్, రఘునాథ్, జగన్నాథరావు, లక్ష్మణ్‌రావు, సీతారాం, రాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ ఉత్తర్వులను సవరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 28: రేషనలైజేషన్ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశాస్త్రీయమైన సర్దుబాటు జీవో నం.25ను సవరించాలని, సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్‌చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమంత్, రమేష్, శ్యాంరావు, రవీందర్, సంజయ్‌కుమార్, బాదిరావ్, మాన్కు, కిషన్, ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వాంకిడి, సెప్టెంబరు 28: నేటియువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లాఅధ్యక్షుడు టీకానంద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ డిగ్రీకళాశాలలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణి, నిఖిల్, తిరుపతి, శ్రావణి, ఆశ్లేష, తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



ఆసిఫాబాద్‌లో కేసులను పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 28: రాజీమార్గమే రాజమార్గమని లోక్‌అదాలత్‌లో కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లాప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయలోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, తదితర 4867కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివిల్ జడ్జిఅనంత లక్ష్మి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, న్యాయ వాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 340కేసులు పరిష్కారం

సిర్పూర్(టి): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిర్పూర్(టి) న్యాయమూర్తి అజయ్‌వొలాలఅన్నారు. శనివారం సిర్పూర్(టి) కోర్టులో జాతీయ లోక్‌అదాలత్, న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై అందరు అవగాహన కలిగి ఉంటే తప్పులు జరగవన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జాతీయలోక్ అదాలత్ నిర్వహించి రాజీమార్గంలో 340 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. అలాగే రూ.16,57,620 నగదు రికవరీ అయినట్లు తెలి పారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు శంకర్‌రావు, రైయిస్ అహ్మద్, దయరాజ్‌సింగ్, కళ్యాణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి)లో అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి అజయ్ వొలాల

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28: ఈనెల30న ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఒకప్రకటనలో కోరారు. సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు, సింగరేణికి రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సిన 33వేల కోట్లరూపాయలబకాయిలు చెల్లించాలని, కాంగ్రెస్‌నాయకులు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాలని, కాంట్రాక్టు కార్మికులకు పీఎల్‌ఆర్ బోనస్, సామాజిక భద్రత,వైద్యసదుపాయాలు కల్పించాలనే డిమాండ్లతో నిర్వహించే ఈధర్నాకు జాతీయనాయకులు హాజరవుతున్నారని, కార్మికులు భారీఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

బుద్ధి, బలం మిశ్రమమే కబడ్డీ క్రీడ

రెబ్బెన, సెప్టెంబరు 28: బుద్ధి, బలం మిశ్రమే కబడ్డీ క్రీడా అని బెల్లంపల్లి ఏరియా సివిల్ ఎస్ఈ భాషా అన్నారు. శనివారం గోలేటిలోని సింగరేణి స్కూల్‌లో 91వ వార్షిక క్రీడాపోటీల్లో భాగంగా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం కబడ్డీ ఆటకు దేశ, విదేశాల్లో మంచి క్రేజ్ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకులు బి జగ్గయ్య, జూపాక రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి: జీఎం



1ఏ టన్నెల్ పనులను పరిశీలిస్తున్న మందమర్రి జీఎం దేవేందర్

కాసిపేట, సెప్టెంబరు 28: కార్మికులందరూ సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేలా పనిచేయాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. శనివారం కాసిపేట 1ఏ టన్నెల్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వార్షిక ఉత్పత్తిని అధిగమించేందుకు కార్మికులందరూ రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తిని సాధించాలన్నారు. కార్యక్రమంలో గ్రూపుఏజెంటు రాందాస్, గనిమేనేజర్ భూశంకరయ్య, గ్రూపు ఇంజనీర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియాలో పతకాలు సాధించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 : కోల్ ఇండియాలో పతకాలు సాధించేలా క్రీడాకారులు ప్రతిభ కనబర్చా లని సింగరేణి సెక్యూరిటీ అధికారి రవి, ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ పేర్కొన్నారు. శనివారం సింగరేణి పాఠశాల మైదానంలో ఏరియా 60వ కార్మికవార్షికక్రీడల్లో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలకువారు హాజరై క్రీడాకారులను పరిచయంచేసుకుని క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలకు యాజమాన్యం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌కోఆర్డినేటర్ శివకుమార్, కెప్టెన్ బానయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నాగేశ్వర్‌రావు



నాగేశ్వర్‌రావు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28: గుర్తింపుసంఘం ఏఐటీయూసీ మందమర్రిఏరియా బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కేకే5 గనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ నాగేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ శనివారం ఆయనకు నియామకపత్రం అందించారు.

రక్తదాన శిబిరానికి జీఎంకు ఆహ్వానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్1న నిర్వహించే రక్తదాన శిబిరానికి రావాలని జీఎం సంజీవరెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు జీఎం కార్యాలయంలో శనివారం ఆయనకు ఆహ్వానపత్రిక అందించారు. సింగరేణి ఆధ్వర్యంలో తరచూ రక్తదానశిబిరాలు నిర్వహిస్తున్నందున కలెక్టర్ చేతులమీదుగా సత్కారం స్వీకరించాలని కోరారు. ఆహ్వానపత్రిక అందించిన వారిలో లయన్ వి మధుసూదన్ రెడ్డి, లయన్ ఎస్ నాగేందర్, బ్లడ్‌బ్యాంక్ మోటివేటర్ ప్రేమ్‌కుమార్ సింగ్ ఉన్నారు.

'ఏఐటీయూసీ ఆరోపణలను ఖండిస్తున్నాం'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28: ఏఐటీయూసీ ఆరోపణలను ఖండిస్తున్నామని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్ రావు అన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల ప్రతి గేట్‌మీటింగ్‌లో ఏఐటీయూసీ తమ యూనియన్‌ను, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తోందన్నారు. ఎమ్మెల్యేకు ప్రజలు, కార్మికులు చెప్పుకున్న సమస్యలను పరిష్కరించాలని జీఎంకు విన్నవిస్తే రాజకీయ జోక్యం అవుతుందా అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, ఉపప్రధాన కార్యదర్శి గరిగెస్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ జోక్యాన్ని తగ్గించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28: సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఆర్కే6,7గనులపై శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో రాష్ట్రప్రభుత్వం మితిమీరిన రాజకీయజోక్యం చేసుకుంటోందన్నారు. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వంనుంచి రావాల్సిన 32వేల కోట్లరూపాయల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశాల్లో ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కేబాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదే

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28: కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదేనని ఆ యూనియన్ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. ఆర్కే7 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంట్రాక్టు కార్మికులకు భవిష్యత్తులో కోల్‌ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు, జీవో 22 అమలు అయ్యేంత వరకు తాము ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు. ఎస్‌టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య చేసుకుని మరణించేందుకు కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, సహాయకార్యదర్శి వేల్పుల తిరుపతి, కార్మికులు, శ్రీనివాస్, దిలీప్, విక్కీ, ఆదిత్య పాల్గొన్నారు.

పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

నెన్నెల, సెప్టెంబరు 28: శ్రావణపల్లి గ్రామంలో శనివారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ మాట్లాడుతూ పోలీసు జాగిలాల ద్వారా గంజాయి కలిగి ఉన్నా, తాగినా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. యువత గంజాయి బారిన పడి ఆరోగ్యాలను, జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. 150 లీటర్ల గుడుంబా ద్రావణాన్ని పారబోశారు. ఎస్ఐ ప్రసాద్, తాళ్ల గురిజాల ఎస్ఐ రమేష్, బెల్లంపల్లి టూటౌన్ ఎస్ఐ మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే

కోటపల్లి, సెప్టెంబరు 28: మోడల్ స్కూల్, కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్‌తోపాటు ఉపాధ్యాయులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఆటాపాటలు, నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 : పట్టణంలోని ప్రాణహిత కాలనీలో లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలను శనివారం కాంగ్రెస్ నాయకులు పుల్లూరి లక్ష్మణ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్


కౌన్సిలర్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28 : క్యాతనపల్లి మున్సిపాలిటీ 21వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ పార్వతి విజయ కాంగ్రెస్ పార్టీలో చేరగా శనివారం మంచిర్యాలలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాజు, అబ్దుల్ అజీజ్, రఘునాథ్ రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా హోమం

బెల్లంపల్లి, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేసిన కారణంగా శనివారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వేద పండితులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందువుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా లడ్డును అపవిత్రం చేయడం సరైంది కాదని, సనాతన ధర్మం అంటే ఎందుకు ఇంత కుట్ర అని అన్నారు. లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేసిన ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భజరంగ్‌దళ్ సేవాదళ్ నాయకులు, హిందూ ఉత్సవ సమితి , హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్న ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28: ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అమలు చేస్తున్నారని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి సదానందం యాదవ్ తెలిపారు. శనివారం మందమర్రిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి రూ.3కోట్లు మంజూరు చేశారన్నారు. కాకా సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి నిర్వహిస్తోందని తెలిపారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు

దండేపల్లి, సెప్టెంబరు 28: జాతీయ రేబిస్ డే పురస్కరించుకొని రెబ్బనపల్లి, దండేపల్లి పశు వైద్యశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాలలో రేబిస్ ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు మంతి రాజు, కార్యదర్శి గంగారాంపాల్గొన్నారు.

భీమారం: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేసినట్లు పశు వైద్యుడు రాకేష్ శర్మ తెలిపారు. కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలను వేయించాలని సూచించారు.

వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి, సెప్టెంబరు 28 : కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి లింగన్న వైద్య ఖర్చుల కోసం ఎన్‌వోసీని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అందజేశారు. లింగన్న అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో రూ. 2 లక్షల 50వేల ఎల్‌వోసీ పత్రాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

పోలీసు జాగిలంతో తనిఖీలు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28 : శ్రీరాంపూర్‌లో నార్కోటిక్స్ జాగిలం ద్వారా శనివారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇండ్లు, పరిసర ప్రాంతాలు, గంజాయి తాగే అవకాశం ఉన్న ప్రాంతాలను జల్లెడ పట్టారు. గంజాయి కేసులలో ప్రమేయం ఉన్న పాత నేరస్తులతో ఎస్ఐ సంతోష్ మాట్లాడుతూ, గంజాయి తాగడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. సమాచారం ఉంటే వెంటనే 100కు డయల్ చేయాలని కోరారు.

కుటుంబంపై పగబట్టిన విధి



కాసిపేట, సెప్టెంబరు 28: ఆమె పేరు సత్యవతి. పుట్టిన కొన్ని రోజులకే తల్లి దారవేని ఓదమ్మ మరణించింది. ఏడాది తర్వాత తండ్రి మల్లయ్య అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. సత్యవతిని కాసిపేట మండలం ముత్యంపల్లికి చెందిన అమ్మమ్మ, తాత రేషవేని బుచ్చక్క-రాయమల్లు చేరదీశారు. అనంతరం కొద్ది రోజులకే అమ్మమ్మ మృతి చెందింది. తాత రాయమల్లు సత్యవతిని పెంచి పెద్దచేశాడు. రెండేళ్ల క్రితం బెల్లంపల్లి మండలం కన్నాలకు చెందిన కొమ్ము శివకుమార్‌తో సత్యవతికి వివాహం జరిగింది. వీరికి బాబు జన్మించాడు. ఆనందంగా సాగుతున్న వీరి కాపురంలో ఆగస్టులో బెల్లంపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్ మృతి చెందాడు. దీంతో సత్యవతి జీవితం మళ్లీ ఒంటరైంది. కష్టాలను దిగమింగుకుని జీవిస్తున్న సత్యవతి ఇటీవల అనారోగ్యానికి గురైంది. చికిత్స చేయించుకోగా గొంతు కేన్సర్ ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. వైద్యానికి సుమారు రూ. 15 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. 80 ఏండ్ల వయసున్న రాయమల్లు మునిమనువడిని చూసుకోవడం కష్టంగా మారింది. రాయమల్లుకు ఆసరా పింఛన్‌తో పూట గడుస్తోంది. దీనికి తోడు ఇటీవల జారి పడడంతో కాలు విరిగింది. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న మనవరాలును చూస్తూ తాత కన్నీంటి పర్యంతమవుతున్నాడు. దాతలు ఎవరైనా ఆదుకోవాలని, 8897366143 నెంబర్‌కు ఫోన్‌పే చేయాలని బాధిత కుటుంబీకులు కోరారు.

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 28: గుండెపోటు ఇటీవల కాలంలో తరుచుగా వినిపిస్తోంది. వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. నేడు ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

ఇటీవల బీపీ, మధుమేహం బారిన పడుతున్న వారు రోజు రోజుకు పెరుగుతున్నారు. ప్రధానంగా ఈ వ్యాధులతోనే గుండెకు ముప్పు ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వీటిని అదుపులో పెట్టుకోవడం ద్వారా గుండెపోటు నుంచి బయట పడవచ్చని పేర్కొంటున్నారు. రోజు నడక, పరుగు, వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఫలితం ఉంటుందని పేర్కొంటున్నారు. అధిక ఆయిల్, ఉప్పు, హోటళ్లలో తినడం వల్ల కొవ్వు పెరిగి గుండెపోటు వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఉదయం కనీసం గంట సేపు వ్యాయామం చేయడం, ఆహారం అలవాట్లు మార్చుకోవడం ద్వారా బీపీ, షుగర్‌ను అదుపులో పెట్టుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

విభిన్న ఆలోచనల ద్వారానే నూతన ఆవిష్కరణలు

జైపూర్, సెప్టెంబరు 28: విద్యార్థులు విభిన్న తార్కిక ఆలోచనల ద్వారానే శాస్త్రవేత్తలుగా తయారవుతారని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అటల్ టింకర్ ల్యాబ్ ప్రాజెక్టుల ప్రదర్శనలో భాగంగా ల్యాబ్‌లో విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తార్కిక ఆలోచనల ద్వారా సైంటిస్టులుగా తయారవుతారని, దీనికి అటల్ టింకర్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో అటల్ టింకర్ ల్యాబ్‌లు 8 ఉన్నాయన్నారు. అటల్ టింకర్ ల్యాబ్‌లో ఉత్తమ ప్రదర్శనకు పదో తరగతి విద్యార్థి అఖిల్‌కు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. 6వ తరగతిలో హాజరు శాతం ఎక్కువున్న విద్యార్థిని ఎలిసాల తేజస్విని డీఈవో సన్మానించారు.



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న డీఈవో

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ మద్దుల సునీత, మండల విద్యాధికారి శ్రీని వాస్, ప్రధానోపాధ్యాయురాలు ఆలిష్‌మాధుర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 28: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాల, హాజీపూర్‌లోని మౌంట్ కార్మల్ పాఠశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, తిరుపతిలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబం ఎక్కిన మహనీయుడు భగత్‌సింగ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలో ఎంసీపీఐయూ నాయకు లు భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. రామా టాకీస్ చౌరస్తాలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పసులేటి వెంకటేష్, ఆరేపల్లిరమేష్, సతీష్, పోషణ్ణ, షేక్ మహ్మద్, రాజేష్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా సన్నీగౌడ్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 28: అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బీ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కనుకుంట్ల సన్నీ గౌడ్ నియమితులయ్యారు. ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న సన్నీగౌడ్ జిల్లా రిపోర్టును ప్రవేశపెట్టారు. వసతి గృహాలు, విద్యాసంస్థల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్నీగౌడ్‌ను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు.

వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుదాం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 28: కుల అణిచివేతకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి అరుణలు పేర్కొన్నారు. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఎఫ్‌సీఐ గోడౌన్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కులం పోవాలి అందరికి విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జ్యోతిరావుఫూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారని తెలిపారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా అందరు పోరాడాలని పేర్కొన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, మల్లన్న, శ్రీకాంత్, మహేశ్వరి, మంగ, విజయ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

చెన్నూరు, సెప్టెంబరు 28 : లోక్ అదాలత్ ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా సత్వర న్యాయం పొందవచ్చని చెన్నూరు మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి రవి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లు, బ్యాంకుల పరిధిలోని 392 కేసులను పరిష్కరించారు. కేసుల పరిష్కారం ద్వారా రూ. 88,85,854 నగదు జరిమానాల రూపంలో జమైనట్లు తెలిపారు.



కక్షిదారులను విచారిస్తున్న న్యాయాధికారి

పిచ్చి కుక్కదాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

భీమిని, సెప్టెంబరు 28: పిచ్చి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. శనివారం ఖర్జీ భీంపూర్ గ్రామంలో ఠాకూర్ గోపాల్ సింగ్ కూతురు ఆనందిని (4) ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేయడంతో చేతికి గాయమైంది. ఎస్సీ కాలనికి చెందిన టేకం గోపాల్ కూతురు అక్షిత (7)పై పిచ్చి కుక్క దాడి చేయడంతో ముఖం, కాళ్లకు గాయాలయ్యాయి. ఇరువురిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. స్థానికులు కుక్కను చంపివేశారు.

పంట కోత ప్రయోగాలకు పొలాల ఎంపిక

మందమర్రిరూరల్, సెప్టెంబరు 28: చిర్రకుంట, సారంగపల్లి, లేమూరు గ్రామాల్లో శనివారం ఏఈవో ముత్యం తిరుపతి వరి, పత్తి పంట కోత ప్రయోగాలకు పొలాలను ఎంపిక చేశారు. పంట దిగుబడి అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగం ఉపయోగపడుతుందన్నారు.

నేడు గణేష్ విగ్రహ రథాలకు బహుమతులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 28: గణపతి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న గణేష్ విగ్రహాల రథాలకు ఆదివారం ఖండేల్వాల్ భవన్‌లో బహుమతులు అందిస్తామని హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దీపేష్‌రేణువ తెలిపారు. శనివారం ఖండేల్వాల్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు నిర్వహించే బహుమతి కార్యక్రమానికి అన్ని మండపాల నిర్వాహకులు హాజరుకావాలని కోరారు. హిందూ ఉత్సవ కమిటీ వేదిక ముందు నుంచి వెళ్లిన వాటికి, టూటౌన్ ప్రాంతాల గణేష్ విగ్రహ రథాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమ తులు అందించనున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్‌శెట్టి, ప్రధాన కార్యదర్శి రవీందర్, కృష్ణ, తిరుపతి, సత్యపాల్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని బస్సులు బస్టాండ్‌కు వచ్చేలా చూడాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28: పట్టణంలోని మార్కెట్‌లో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా చూడాలని శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్‌కు బీఎస్పీ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ ముల్కల్ల రాజేంద్రప్రసాద్ వినతిపత్రం అందించారు. బస్సులు మందమర్రి బస్టాండ్‌కు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వెళ్లే బస్సులు మందమర్రి బస్టాండ్‌కు రావడం లేదని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మందమర్రి మార్కెట్ నుంచి మంచిర్యాల, కరీంనగర్‌కు, హైద్రాబాద్‌కు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాల్లో మంచిర్యాలకు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తుందన్నారు. బస్‌షెల్టర్ల వద్ద ఆపకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జైపూర్, సెప్టెంబరు 28: ఇందారం బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి బైక్ పశువులను ఢీకొని సిర్ర ప్రవీణ్ (25) అనే యువకుడు మృతి చెందగా పొన్నం అజయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు జైపూర్ రెండవ ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన సిర్ర ప్రవీణ్, తిమ్మాపూర్ చెందిన పొన్నం అజయ్‌లు బైక్‌పై మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి తిరిగి వెళ్తుండగా ఇందారం బస్టాండ్ సమీపంలో పశువులను ఢీకొన్నారు. ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందగా పొన్నం అజయ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అజయ్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



ఎర్రయ్య (ఫైల్)

కాసిపేట, సెప్టెంబరు 28: సోనాపూర్ పంచాయతీ జెండగూడకు చెందిన టేకం ఎర్రయ్య(28) భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రయ్య వ్యవసాయ కూలీ. కుటుంబాన్ని పట్టించుకోకుండా మద్యం సేవిస్తుండడంతో భార్య బొజ్జుబాయి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. మూడు రోజుల క్రితం ఎర్రయ్య భార్యను కాపురానికి రావాలని కోరాడు. నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఎర్రయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కొడుకు, ఐదు నెలల కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గర్మిళ్ల, సెప్టెంబరు 28: మంచిర్యాలలోని సంతోష్‌నగర్, సాయికుంట కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో శనివారం టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎస్ఐ, సిబ్బంది దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న తోట మహేందర్, మహిళ, విటుడు బోలెం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

యువకుడి మృతికి కారణమైన ఆర్‌ఎంపీ అరెస్టు

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 28: కొత్తకొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ అనే యువకుడి మృతికి కారణమైన ఆర్‌ఎంపీని అరెస్టు చేసినట్లు సీఐ నరేందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మధుకర్ జ్వరంతో బాధపడుతుండగా కన్నెపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ బొడ్డు శ్రీనివాస్ వద్దకు తీసుకెళ్లారు. మధుకర్‌కు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకుండా గ్లూకోజ్ ఎక్కించడంతోపాటు ఇంజక్షన్లు వేశాడు. మధుకర్ చలితో వణుకుతూ వాంతులు చేసుకున్నాడు. దీంతో ఆర్‌ఎంపీ వైద్యుడు మధుకర్‌ను ఏదైనా పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పడంతో మంచిర్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ మధుకర్ బ్రెయిన్ డెడ్ అయి చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మధుకర్ తండ్రి రాజలింగయ్య ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంపీ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం దగ్ధం

కన్నెపల్లి, సెప్టెంబరు 28: మండలంలోని మొక్కంపల్లి గ్రామంలో గాదర్ల మహేష్ అనే వ్యక్తికి చెందిన పల్సర్ బైక్‌ను ఇంటి ఎదుట పార్కు చేశాడు. శుక్రవారం రాత్రి శబ్దం వినిపిస్తే ఇంట్లో ఉన్న మహేష్ తల్లి ప్రేమల బయటకు వచ్చి చూసే సరికి బైక్ కాలిపోతోంది. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన గాదర్ల రాజేష్ పరిగెత్తుతూ వెళ్లడం చూసింది. శనివారం రాజేష్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

తాండూర్, సెప్టెంబరు 28: బోయపల్లిలో ఎస్ఐ కిరణ్‌కుమార్ ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. రాత్రి వేళలో పశువులు రోడ్లపైకి వస్తున్నాయని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పశువుల రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం



అవగాహన కల్పిస్తున్న పోచం

సిర్పూర్(టి), సెప్టెంబరు 28: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం చేయవచ్చని ఆసిఫాబాద్ డిపో ఏడీసీ సేఫ్టీవార్డెన్ పోచం అన్నారు. శనివారం మండలకేంద్రంలో ప్రజలకు, ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ఆటోలలో, మినీవ్యాన్‌లలో ప్రయాణించరాదని సూచించారు. ప్రతి ఒక్కరికి పల్లెవెలుగు బస్సుల సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సులు కన్నతల్లితో సమానమని అన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఇప్పతుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా



స్వచ్ఛతాహీ సేవా సింబల్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28: కాగజ్‌నగర్ కస్తూర్బా గాంధీ బాలబాలికల పాఠశాలలో పునర్నవ సోషల్ ఫౌండేషన్, మున్సిపాల్టీ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలబాలికల పాఠశాల స్పెషల్ అధికారిణి రమాదేవి, పునర్నవ సోషల్ ఫౌండేషన్ ఇన్‌చార్జీ బొర్లకుంట అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్వేరో కమిటీ

చింతలమానేపల్లి, సెప్టెంబరు 28: మండల స్వేరోకమిటీని ఎన్నుకున్నట్లు జిల్లాఅధ్యక్షుడు సురేష్ మీడియాఇన్‌చార్జి విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, ఏఎంఎస్‌డబ్ల్యూ మమత తెలిపారు. మండలాధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా రాకేష్, ప్రధానకార్యదర్శిగా షారూక్‌ఖాన్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కార్తీక్, కోశాధికారిగా రాజు, స్పోక్ పర్సన్‌గా అశోక్, ఎక్సేవేటివ్‌గా అశోక్, సుదర్శన్, గులాబ్‌ను ఎన్నుకున్నారు.

ఓటరు తుదిజాబితా ప్రచురణ

దహెగాం, సెప్టెంబరు 28: రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను నోటీసుబోర్డుపై శనివారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. తప్పు ఒప్పులను సరిచూసుకోవాలని తెలిపారు.

'లడ్డు కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డును కల్తీ చేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జనసేన నాయకులు డిమాండు చేశారు. శనివారం స్థానికంగా వారు మాట్లాడారు. పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూలను కల్తీ చేసిన అధికారులు, సిబ్బందిపై వెంటనే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పోతుల ప్రవీణ్, అక్కెనపల్లి బాలేష్, రాజేష్, మనీష్, గణేష్, సాయికృష్ణ, వినీష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

● నిందితుడిని శిక్షించాలని విద్యార్థుల రాస్తారోకో

● పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 28: ఓ కామాంధుడు 8వతరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామంలో 8వ తరగతి చదువుతున్న బాలిక రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత సైకిల్‌పై ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బొమ్మెన సాగర్(29) మద్యం మత్తులో ఒక్కసారిగా బాలికపై దాడిచేశాడు. బాలికను బలవంతంగా ఇంట్లోకి ఎత్తుకొని వెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం బాలిక రోదిస్తూ ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితుడిని శిక్షించాలని రాస్తారోకో..

బాలికపై అత్యాచారంచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తోటి విద్యార్థులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు శనివారం బూర్గుడ వద్ద జాతీయరహదారిపై ఉదయం ధర్నా నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాలికకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. గంటన్నర పాటు ధర్నా చేపట్టడంతో జాతీయరహదారిపై భారీట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పట్టణసీఐ సతీష్ అక్కడికి వచ్చి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. నిందితుడికి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని ఆందోళన చెందవద్దని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

గతంలోనూ నిందితుడిది ఇదే వైఖరి..

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు సాగర్ వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మద్యంమత్తులో ఉంటాడు. అతని వైఖరి గతంలోనూ ఇదే తరహా ఉండేదని గతంలో ఇద్దరు మహిళలపై సైతం అత్యాచారయత్నం చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కాగా అతడికి భార్య, ఓ కుమారుడు ఉన్నాడని అతని వైఖరి నచ్చక దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు



నిందితుడిని అరెస్టు చూపెడుతున్న సీఐ సతీష్

నిందితుడిని శిక్షించాలని వినతి..

నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాలికకు న్యాయం చేయాలని ఎస్సీ వర్గానికి చెందిన వారు కోరారు. అనంతరం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిందితుడిపై పోక్సో కేసు నమోదు..

బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్ వెల్లడించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్‌ఎస్ చట్టం సెక్షన్ 65(1) పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలికకు న్యాయం చేస్తామనివెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28: ఎస్‌ఎఫ్ఐ నాయకులు శనివారం కాగజ్‌నగర్‌లో నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమఅరెస్టు చేసిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ పోరాటాలు చేస్తే అరెస్టు చేయటం ఎంతవరకు సమంజసమన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జానపద నృత్యపోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 28: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కౌటాల కేజీబీవీ విద్యార్థులు ప్రథమ, రెబ్బెన కేజీబీవీ విద్యా ర్థులు ద్వితీయ, చింతలమానేపల్లి కేజీబీవీ విద్యార్థులు తృతీయ బహుమతి సాధించినట్లు జిల్లావిద్యాశాఖ అకాడమి మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జ్యూరీమెంబర్లు వెంకట్రావు, సురేష్, ధర్మయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

చెక్ అందజేసిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, సెప్టెంబరు 28: సీఎం సహాయనిధి ద్వారా విడుదలైన లక్ష రూపాయిల చెక్‌ను సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు



ఎంపికైన బాలుర జట్టు



ఎంపికైన బాలికల జట్టు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 28: ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శబాలికల క్రీడాపాఠశాలలో శనివారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యం లో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపికపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎంవో ఉద్దవ్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో వందమందివిద్యార్థులు పాల్గొనగా 16 మంది బాలికలు, 16మంది బాలురలను ఎంపిక చేశారు. వీరు ఈనెల 30న జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో ఆసిఫాబాద్ జిల్లాజట్టు తరఫున ఆడనున్నారు. ఎంపికైనక్రీడాకారులను డీఈవోయాదయ్య అభినందించారు. కార్యక్రమంలో క్రీడాధికారి మీనారెడ్డి, కోచ్‌రాకేష్‌రవి, పీడీ, పీఈ టీలు విద్యాసాగర్, సాయి, రజిత,యాదగిరి, ప్రమోద్ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు


వాంకిడి, సెప్టెంబరు 28: మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజనబాలికల ప్రాథమిక ఉన్నతఆశ్రమపాఠశాలలో శనివారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైంలకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్100కు, షీటీం 8712670564కు కాల్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, షీ టీంసభ్యులు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

వాంకిడి, సెప్టెంబరు 28: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయపార్టీల నాయకు లకు ఎన్నికలపై తహసీల్దార్ రియాజ్‌అలీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక సారాంశ పునశ్చరణ2025 అనే అంశంపై రాజకీయపార్టీల నాయకులకు అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.


వాహనాల తనిఖీ

కౌటాల, సెప్టెంబరు 28: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సంద ర్భంగా వాహనదారుల పత్రాలు పరిశీలించారు. పత్రాలు, హెల్మెట్‌లేని వారికి జరిమానా విధించినట్లు తెలిపారు.



విభిన్న ఆలోచనల ద్వారానే నూతన ఆవిష్కరణలు
7లో..
లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి పది రోజుల్లో విధివిధానాలను ప్రకటించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో సొంత ఇంటి కోసం ఎదురు చూస్తున్న గూడు లేని నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సొంత స్థలం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.



ఆశల పల్లకిలో..

ఆశావహులు

- ఇందిరమ్మ ఇళ్లపై త్వరలో విధి విధానాలు
- కొత్త దరఖాస్తుల స్వీకరణకూ ఏర్పాట్లు
- స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం
- ఎమ్మెల్యేల చేతిలోనే లబ్ధిదారుల ఎంపిక
- వివరాల నమోదుకు ప్రత్యేక యాప్

మంచిర్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల మినహా మిగతా వాటిని అమలు చేస్తోంది. ఎనిమిది నెలలు గడుస్తున్నా స్పష్టమైన నిర్ణయం తీసుకోని కారణంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇంకా పట్టాలెక్కలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో చేసిన తప్పులు ఇందిరమ్మ పునరావృతం కాకూడదనే రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ప్రస్తుతం నిర్మాణమైన, అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు కొన్ని పంపిణీకి నోచుకోగా, అధిక భాగం వృథాగా ఉన్నాయి. మరోవైపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి బదులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపైనే ప్రధానంగా దృష్టి సారించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. మార్గదర్శకాలు జారీ అయిన తర్వాత ప్రజాపాలనలో భాగంగా గ్రామ, పట్టణ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.

11వేల ఇళ్లు మంజూరుకు అవకాశం

జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలం కూడా జిల్లా పరిధిలోకే వస్తుంది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ లెక్కన జిల్లాలోని మంచి ర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలతోపాటు జన్నారం మండలా నికి కలిపి మొత్తం సుమారు 11వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటికి తోడు రిజర్వుడ్ కోటా కింద మరికొన్ని ఇళ్లు కూడా ప్రభుత్వం మంజూరు చేయనుంది. కలెక్టర్‌తోపాటు ఇన్‌చార్జి మంత్రి ఆధీనంలో ఉంటాయి. అవసరాన్ని బట్టి అర్హులైన వారికి వాటిని అప్పటికప్పుడు మంజూరు చేసే వెసలుబాటు కల్పించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, స్థలాల కోసం 2,10,206 దరఖాస్తులు వచ్చాయి.

ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తుది నిర్ణయాన్ని ప్రభుత్వం ఎమ్మెల్యేలకే వదిలిపెట్టింది. ఆయా గ్రామాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు తమకు అనుకూలంగా ఉండే వారికి ఇళ్లు కేటాయించేలా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవలసి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో డబుల్ ఇళ్ల మంజూరు బాధ్యత కలెక్టర్లకు అప్పగించింది. అయినా రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో పథకం నిర్వీర్యం అయింది. ప్రస్తుతం ఎమ్మెల్యేల చేతిలో ఆ ప్రక్రియ ఉండటం, గ్రామాలు, వార్డుల్లో స్థానిక నాయకుల హవా నడవనుండటంతో అర్హులకు ఇళ్లు అందుతాయా...? అనే సందేహాలు కలుగుతున్నాయి.

రిజర్వేషన్ దామాషాన...

ప్రజాపాలనలో మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకునే అవకాశాలున్నాయి. తెల్ల రేషన్ కార్డుతోపాటు అందులో పేరు ఉన్న మహిళలకు ఇళ్లు మంజూరు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. వివిధ వర్గాలకు రిజర్వేషన్ దామాషానా ఇళ్ల మంజూరు జరుగనుంది. దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10, బీసీ మైనార్టీ లకు 50, జనరల్ కోటాలో 15 శాతం ఇళ్లు కేటాయించనున్నారు. గతంలో ఇళ్లు మంజూరైనా, దళితబంధు పథకం పొందిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు సంబంధించి ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు చూపాల్సి ఉంటుంది. సొంత స్థలం కనీసం ఒక గుంట పట్టా కలిగి ఉండాలి. బేస్‌మెంట్ నుంచి ఇల్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో నగదు చెల్లించనున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాత

ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు అర్హులా? కాదా? అనే విషయాన్ని అధికారులు పరిశీలించి ఖరారు చేయనున్నారు. ఇందు కోసం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని నిర్ణయించింది. దరఖాస్తుదారుల ఆధార్, తెల్లరేషన్ కార్డులను పరిశీలిస్తారు. గ్రామంలో ఎప్పటి నుంచి నివాసం ఉంటున్నారు? ప్రస్తుతం ఏ ఇంట్లో ఉంటున్నారనే వివరాలను సేకరిస్తారు. ఇంటి స్థలం ఉన్నవారైతే సదరు స్థలం సొంతమేనా? దాని స్వభావం, ఎలా సంక్రమించింది? అనే వివరాలను తీసుకుంటారు.

ప్రత్యేక యాప్ సహాయంతో

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అర్హుల గుర్తింపు, ఇళ్ల నిర్మాణం, అందజేసే ఆర్థిక సహాయం, మంజూరు వరకు మొత్తం ప్రక్రియను యాప్ ద్వారానే నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి కేంద్రం ఒక యాప్‌తోపాటు పోర్టల్‌ను సూచిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం రూపొందించిన వాటి ద్వారానే పథకాన్ని అమలు చేయాలా? లేక రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేవడమా? అనేఅంశంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

భూ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ నాయకుల నిరసన

బెల్లంపల్లి, సెప్టెంబరు 28: టీడీపీ కార్యాలయానికి కేటాయించిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన చేపట్టారు. టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మణిరాంసింగ్ మాట్లాడుతూ కన్నాల బస్తీలో టీడీపీ కార్యాలయానికి 8 గుంటల భూమిని కేటాయించారని, కొన్ని రోజుల క్రితం కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి భూమి కబ్జా చేశారన్నారు. ఈ విషయంపై అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించకపోవడంతో నిరసన చేపడుతున్నామన్నారు. కొందరు మున్సిపల్ అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలికి ఇంటి నెంబర్లను కేటాయించారని, కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గద్దల నారాయణ, నాయకులు మల్లయ్య గోపాల్, తిరుపతి, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నస్పూర్, సెప్టెంబరు 28: కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు అందించారు. నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలన్నారు. మహిళా కార్మికులపై లైంగిక వేధింపులు అరికట్టాలని, ఆరు మాసాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను అమలు చేయాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోగా వేతనం చెల్లించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యాలను కల్పించాలన్నారు. రంజిత్ కుమార్, రాజేశ్వరి, ప్రకాష్, గట్టు మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో నంబర్ 25ను సవరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దండేపల్లి, సెప్టెంబరు 28: జీవో నెంబర్ 25ను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని దండేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం నల్లబ్యాడ్జిలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలలను విస్మరిస్తూ విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని 1నుంచి 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని, 11 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయుటకు జీవో 25ను ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా ఇక్కడే సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలి

వేమనపల్లి, సెప్టెంబరు 28: గ్రామాల్లో రోజు ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం నీల్వాయిలో పర్యటించి పారిశుధ్య పనులను, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛతాహి సేవలో భాగంగా కిరాణ షాపుల యజమానులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, డంపిగ్‌యార్డును పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తృతీయ స్థానం

గర్మిళ్ల, సెప్టెంబరు 28: సికింద్రాబాద్ లోని ఆర్ఆర్‌సీలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్ 17 విభాగంలో మంచిర్యాల క్రీడాకారిణి అనన్య మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. అనన్యకు ఇంటర్నేషనల్ స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్లు సాత్విక్ సాయి రాజ్, చిరాగ్‌శెట్టిలు బహుమతులు అందించారు. అనన్య జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు అర్హత సాధించిందని సెక్రెటరీ సుధాకర్ తెలిపారు. సుధాకర్, ముకేష్‌గౌడ్, వాసు, మీనారెడ్డి, అభినందించారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

మందమర్రిరూరల్, సెప్టెంబరు 28 : ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం పొన్నారంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా దుకాణదారులకు, ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడవద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

నస్పూర్, సెప్టెంబరు 28 : వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో హరీష్ రాజ్ అన్నారు. ప్రపంచ గుండె సంబంధిత వ్యాధుల నివారణ దినం, సఫాయి మిత్ర సురక్ష శివార్ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికులందరికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. పొగాకు వాడకం వలన కలిగే అనర్థాలు, వాటి వలన వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఆహారపు అలవాట్లు, శరీర వ్యాయామం చేయాలని సూచించారు. వైద్య శిబిరంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, జిల్లా ఉప వైద్యాధికారి అనిత, డాక్టర్లు సమత, శివ ప్రతాప్, రుబీనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



దుప్పట్లు అందజేస్తున్న అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 28: విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ భాగ్యవతి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో కలిసి నిద్రించారు. శనివారం విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ బాలికల వసతి గృహాల్లోని సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వార్డెన్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం జిల్లా సహాయక అభివృద్ధి అధికారి భాగ్యవతి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఆమె వెంట వసతి గృహం సంక్షేమాధికారి వెంకటేశం ఉన్నారు.

బాధితులకు నమ్మకం కల్పించాలి : సీపీ



రికార్డులను తనిఖీ చేస్తున్న సీపీ

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 28 : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను సందర్శించి పిటిషన్, రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, మిస్సింగ్, క్రైమ్ కేసులలో ప్రధానమైన సాక్ష్యులతో మాట్లాడి వివరాలు సేకరించాలని సూచించారు. ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే అంశాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. డయల్ 100కి వెంటనే స్పందించి సంఘటన స్థలానికి త్వరగా చేరుకోవాలని సూచించారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ రవి కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, సెప్టెంబరు 28: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాలక్ష్మీ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం అన్ని నెరవేరుస్తున్నారన్నారు. చెన్నూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అనంతరం 70 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు శంకర్, మహేష్, శ్రీనివాస్, శైలజ, సురేఖ, శ్రీనివాస్, నాయకులు సూర్యనారాయణ, కరుణాసాగర్‌రావు, రాంరెడ్డి, ఫయాజుద్దీన్, హేమంతరెడ్డి, పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీకి కాంగ్రెస్ నాయకులు హాజరుకాలేదు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, కోటపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోడిసెల బాపురెడ్డితోపాటు వారి అనుచరులు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

జైపూర్: ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మహాలక్ష్మీ పథకం ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి పాల్గొన్నారు.

భీమారం: పేదల కళ్లలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రైతు వేదికలో మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ మండలానికి చెందిన 2672 మందికి గ్యాస్ ధ్రువపత్రాలను అందజేశామన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను త్వరలోనే అందిస్తామన్నారు. అరుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. స్పెషల్ ఆఫీసర్ కల్పన, నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి పాల్గొన్నారు.

చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చెన్నూరు, సెప్టెంబరు 28: చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వివేకానందతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా నిరంతరం తాగు నీరందించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, ఆసుపత్రుల్లో ప్రజలకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలోని పార్కులు, మురుగు కాలువలు, అంతర్గత రహదారులు, పారిశుధ్య, ఇతర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అంతర్గత రహదారుల పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని, సంబంధిత గుత్తేదారుల సమన్వయంతో పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

కాసిపేట, సెప్టెంబరు 28: రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా శనివారం ఓటర్ల తుది జాబితాను ఎంపీడీవో సత్యనారాయణసింగ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాబితాను కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలుంటే చూసుకోవచ్చని తెలిపారు. సూపరింటెండెంట్ లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

హాజీపూర్, సెప్టెంబరు 28 : బదిలీపై వెళ్తున్న మండల వ్యవసాయాధికారులు రజిత, కనకరాజు, శ్రీనికలను శనివారం గుడిపేట రైతు వేదికలో అధికారులు సన్మానించారు. ఏడీఏ సురేఖ, వ్యవసాయాధికారులు కృష్ణ, ప్రభాకర్, అంజిత్, డీలర్లు ప్రభాకర్‌రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను పునర్వినియోగం చేసుకోవాలి



వస్తువులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, డీఈవో

గర్మిళ్ల, సెప్టెంబరు 28: విద్యార్థి దశలో వ్యర్థాలకు అర్థవంతమైన రూపం తీసుకుని పునర్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో వ్యర్థం నుంచి అర్థం అనే అంశంపై నిర్వహించిన ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను డీఈవో యాదయ్యతో కలిసి పారరంభించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యర్థంగా పడేసిన పేపర్లు, ప్లాస్టిక్, కొబ్బరి పెంకులు, గాజు ముక్కలు, పల్లి, పిస్తా పొట్టు వంటి వాటిని ఉపయోగించి అందంగా అలంకరణ వస్తువులు తయారు చేసి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడం అబ్బురపరిచిందన్నారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ మొత్తం 54 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని వస్తువులను ప్రదర్శించారని తెలిపారు. మొదటి బహుమతి రూ.3 వేలు, ద్వితీయ రూ. 2 వేలు, తృతీయ రూ.వెయ్యి ఐదుగురికి రూ.200 చొప్పున అందించామన్నారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఎన్జీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులు దత్తకుమార్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కాసిపేట, సెప్టెంబరు 28 : మండలంలోని 8 మంది లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. నాయకులు రమేష్, రాజయ్య, రాజమౌళి, రాజిరెడ్డి, సిలార్‌ఖాన్ పాల్గొన్నారు.